క్లుప్తంగా

దుర్గగుడి అభివృద్ధి పనులపై చర్చ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను దుర్గగుడి ఈవో శీనానాయక్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. గొల్లపూడిలోని దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌ను ఈవో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులు, ఆషాఢ మాసోత్సవాలు, శాకంబరీదేవి ఉత్సవాల గురించి ఈవో వివరించారు. ప్రస్తుతం దుర్గగుడి మాస్టర్ ప్లాన్ ప్రకారం జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతి, భక్తుల అభిప్రాయ సేకరణ వివరాలను కమిషనర్‌కు వివరించారు. ఆలయ అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా జరిగేలా చూడాలని, ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారన్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు కుమార్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తమ పాఠశాల విద్యార్థి బి.కుమార్ అండర్ -15 జాతీయ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 20 నుంచి 23 వరకు నాగపూర్‌లో జాతీయ రెజ్లింగ్ పోటీలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో కుమార్ 41 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా కుమార్‌ను హిందూహైస్కూల్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య, కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి జి.బాబా విజయ్ కుమార్, కార్యదర్శి కేఎల్‌వీ మోహనరావు, పాఠశాల పీఈటీ ఎంవీ సత్యప్రసాద్ అభినందించారు.

దాసాంజనేయుని హుండీ ఆదాయం రూ. 9.08 లక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 9 లక్షల 8 వేల 929 ఆదాయం లభించింది. స్థానిక మాచవరం దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో గురువారం దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి పర్యవేక్షణలో సేవా సంఘం సభ్యులు, భక్తుల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు. 3 నెలల 6 రోజులకు గానూ రూ. 9 లక్షల 8 వేల 929 నగదు, 21 అమెరికన్ డాలర్లు లభించాయని ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి తెలిపారు.

పెద్దేశ్వర్ హెల్త్ కేర్‌కు ఐఎస్ఓ 9001-2015 గుర్తింపు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో రెండున్నర దశాబ్దాలుగా గుండె వైద్య సేవలు అందిస్తున్న పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్‌కు ఐఎస్ఓ 9001-2015 గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా గుర్తింపు పత్రాన్ని గురువారం మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు అందుకున్నారు. కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ అందిస్తున్న అత్యున్నత సేవలకు ఐఎస్ఓ 9001-2015 గుర్తింపు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్, హాస్పటల్ సీఈఓ డాక్టర్ ఆకాష్ పల్లెం తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, 10.30 గంటలకు కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం, చాయా చిత్ర ప్రదర్శన, విశేష ప్రతిభ కనపరిచిన అధికారులకు సత్కరిస్తామన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పాల్గొంటారన్నారు.

అగ్రికెమ్‌లో అగ్నిప్రమాదం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం బాలకోటయ్య వీధి మహాదేవ అగ్రికెమ్ కెమికల్ ఫ్యాక్టరీలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఘటనలో బ్లీచింగ్ బస్తాలు, బోరాన్, బోరిక్ బస్తాలు దహనమయ్యాయి. యజమాని శ్యామరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పున్నమి జంక్షన్.. ట్రాఫిక్ టెన్షన్

- నిత్యం జరుగుతున్న ప్రమాదాలు
- ట్రాఫిక్ నిబంధనలు బేఖాతర్
- ఫ్లై ఓవర్ కింద పార్కింగ్
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



పున్నమి హోటల్ ఎదుట ఫ్లైఓవర్ కింద ఐస్ క్రీం వాహనం, ఆటోలతో ఇరుకుగా మారిన మార్గం

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ రహదారి అంటేనే నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేని కొందరు, ఉన్నా పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వాహనాలను నడిపే వారు మరి కొందరితో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా యువత మితిమీరిన వేగంతో వాహనాలను నడిపే తీరు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ లేకపోవడంతోనే ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, నిబంధనలను ఉల్లంఘించేవారికి భారీ జరిమానాలు విధిస్తే తప్ప వారు దారిలోకి రారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారిపై విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ దాటిన తరువాత భవానీపురం పరిధిలోని పున్నమి హోటల్ జంక్షన్ వద్ద నిత్యం రద్దీగా ఉంటుంది. దాదాపు ఆరు వైపుల నుంచి (కుమ్మరిపాలెం సెంటర్ రెండు వైపులా (వన్‌వే) ఉన్న రహదారి గుండా, భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ వైపు నుంచి, భవానీపురం పెట్రోల్ బంక్ వైపు నుంచి (వన్‌వేలో సైతం), పున్నమి ఘాట్ వైపు నుంచి, కరకట్ట సౌత్ రోడ్ నుంచి రాకపోకలు సాగించే వాహనాలన్నీ పున్నమి హోటల్ జంక్షన్ వద్దకు చేరుకుంటాయి. దీంతో అక్కడ ట్రాఫిక్ గందరగోళం నెలకొంటుంది. కొన్ని వైపుల వన్ వే మార్గం అయినప్పటికీ అదేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వాహనాలు దూసుకు వెళుతుంటాయి.



పున్నమి హోటల్ జంక్షన్ వద్ద ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు

జిగ్‌జాగ్‌గా బారికేడ్లు ఏర్పాటు చేయాలి

గతంలో పున్నమి హోటల్ జంక్షన్ దగ్గర జిగ్‌జాగ్‌గా బారికేడ్లు ఏర్పాటు చేసినా అది తాత్కాలికమే కావడంతో ఎవరు ఎటువైపు నుంచి రాకపోకలు సాగిస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇటీవల కుమ్మరిపాలెం సెంటర్ వైపు నుంచి ఒక కారు మితిమీరిన వేగంతో వస్తూ కనకదుర్గ ఫ్లై ఓవర్ కింద నుంచి వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టి ముందుకు దూసుకుపోయింది. దీంతో ఫ్లై ఓవర్ కింద నుంచి వెళుతున్న కారు ముందు భాగం తుక్కుతుక్కు అయ్యింది. అదృష్టవశాత్తు ఆ కారులో ఉన్నవారికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఫ్లై ఓవర్ కింద చల్లగా ఉంటుందన్న కారణంతో పాటు ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని ఐస్ క్రీమ్ విక్రయించే వాహనం, మొక్కజొన్న కండెలు కాల్చేవారు, ఆటోలు, ఇతర వాహనాల పార్కింగ్‌తో అక్కడ పాదచారులు నడిచేందుకు కూడా దారి ఉండని పరిస్థితి. ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు బీట్ ఏర్పాటు చేయడంతో పాటు నాలుగు వైపులా జిగ్‌జాగ్ బారికేడింగ్ ఏర్పాటు చేసి వాహనాల రద్దీని క్రమబద్ధీకరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రించాలి



ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నియంత్రించాలి. పున్నమి హోటల్ (బెరంపార్క్), భవానీ ఐలాండ్‌కు వచ్చే సందర్శకులు, పర్యాటకులు జంక్షన్‌లో నెలకొంటున్న రద్దీని చూసి భయపడుతున్నారు. హరిత బెరం పార్క్ లోపలకు వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ జామ్ అయి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ఇబ్బందికరంగా ఉంటోంది. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి.

– షేక్ హయాత్ షరీఫ్

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి



పున్నమి హోటల్ జంక్షన్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎటు నుంచి ఎటు వైపు వాహనాలు వస్తున్నాయో తెలియని గందరగోళ పరిస్థితి. పున్నమి హోటల్ ఎదురుగా ఫ్లై ఓవర్ కింద చూస్తే హాకర్ల బెడద. ఏదైనా సందర్భం వస్తే తప్ప పోలీసులు జిగ్‌జాగ్ బారికేడ్లు పెట్టటం లేదు. అవి ఉంటే వాహనాల వేగాన్ని నియంత్రించవచ్చు. ఈ జంక్షన్‌లో పోలీస్ బీట్ అయినా ఏర్పాటు చేయాలి లేదా బారికేడ్లు అన్నా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తూ ఉండాలి.

– పొదిలి చంటిబాబు

సునిశిత హాస్యానికి చిరునామా జంధ్యాల

వర్ధంతి కార్యక్రమంలో వక్తల నివాళి



నివాళులర్పిస్తున్న గోపాలకృష్ణ, గుప్తా, ఎంసీదాస్, పీవీఎల్ నృసింహం తదితరులు

విజయవాడ కల్చరల్: సునిశిత హాస్యానికి దర్శకుడు జంధ్యాల చిరునామా అని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. జంధ్యాల వర్ధంతి కార్యక్రమం కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి రామ్మోనరావు (ఆకాశవాణి) కల్చరల్ ఆర్గనైజేషన్, ఎస్వీ రంగారావు విగ్రహ ఆవిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలోని జంధ్యాల విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంధ్యాల ఎందరో హాస్యనటులను వెండితెరకు పరిచయం చేశారన్నారు. చాలా సందర్భాల్లో రియాలిటీ షోలలో హాస్యం అపహాస్యం అవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. జంధ్యాల సినీ రంగ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ జంధ్యాలకు నగరంతో విడదీయరాని సంబంధముందన్నారు. ఆయన బహుముఖ ప్రతిభాశాలి అని చెప్పారు. దర్శకుడిగా, మాటల రచయితగా, నటునిగా నాటక రచయితగా తన ప్రతిభను చాటుకున్నారని వివరించారు. జంధ్యాల కుటుంబ మిత్రులు, విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్, పీవీఎల్ నృసింహం, మాడుగుల రామకృష్ణ, మార్కండేయ రాజు తదితరులు జంధ్యాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు హరగోపాల్, చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్, మల్లేశ్వర పట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు.

పారిశుద్ధ్య సిబ్బంది పనితీరే కొలమానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో పని చేసే పారిశుద్ధ్య సిబ్బంది పని తీరుపై ఆలయ ప్రతిష్ఠ ఆధారపడి ఉందని ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులతో ఆలయ ఈవో గురువారం సమావేశం నిర్వహించారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే భక్తులు హర్షిస్తారని, ఆలయ ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. చిన్న ఉద్యోగులైన మీ అందరి కష్టం తనకు తెలుసునని, ఏ ఇబ్బందులున్నా నేరుగా తనకు వచ్చి చెప్పవచ్చునని ఈవో పేర్కొన్నారు. వేతనాలు విషయంలో కాంట్రాక్టర్ ఏదైనా ఇబ్బంది పెట్టినా, పని చేసే వారికి డ్యూటీలు వేయకపోయినా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. ఆలయ ప్రాంగణంతో పాటు పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్, కనకదుర్గా నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని టాయిలెట్స్ నిర్వహణ చూసే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మూడు ప్రాంతాల్లోనే భక్తుల నుంచి అధిక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండటంతో పాటు భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటల లోపే లోకేషన్, టైమ్‌తో కూడిన సిబ్బంది వర్కింగ్ ఫొటోలు పంపాలని సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేశారు.

అవగాహనతోనే సికిల్ సెల్ వ్యాధి నిర్మూలన

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సంపూర్ణ అవగాహనతో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండపల్లి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ పోస్టర్లు ఆవిష్కరించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటే సికిల్ సెల్ వ్యాధిలో ఈ కణాలు కొడవలి ఆకారంలో ఉంటాయని వివరించారు. ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందని, ఇది అంటు వ్యాధి కాదని వివరించారు. రక్త పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఉన్న వ్యక్తి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సకాలంలో గుర్తించి సరైన వైద్య సదుపాయాలు అందించడం ద్వారా రోగి జీవన నాణ్యతను పెంచొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్‌పర్సన్ సీహెచ్ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీటీడబ్ల్యూవో విజయశాంతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవి, వైద్యాధికారులు పద్మావతి, విజయకుమార్, నోడల్ అధికారి నవీన తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని.. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కోరారు. కలెక్టర్ లక్ష్మీశ ఆకర్ష ఫౌండేషన్, హెల్త్ కేర్, నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు స్వచ్ఛంద సంస్థలు కూడా తోడైతే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాల స్థాయి నుంచే చిన్నారుల్లో మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు, ప్రజలను కూడా చైతన్యవంతులను చేసేందుకు ఈగెల్ భాగస్వామ్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. ప్రతి విద్యా సంస్థలోనూ ఈగెల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమిస్తామని చెప్పారు. జూలై నుంచి ఆరు నెలల పాటు విస్తృతంగా ర్యాలీలు, వాకథాన్‌లు, సదస్సులు వంటివి నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) తరహాలో ప్రణాళిక రూపకల్పనకు స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలన్నారు. వినూత్న ప్రచార సామగ్రితో పాటు ప్రత్యేక డాక్యుమెంటరీని రూపొందించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డా. శంకర్ (ఆకర్ష ఫౌండేషన్)తో పాటు హెల్త్ కేర్ ఎన్జీఓ, నవజీవన్ బాల భవన్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం !



ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కనకదుర్గానగర్‌లోని దుర్గగుడి దేవస్థానానికి చెందిన స్థలంలో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమైంది. కనకదుర్గా నగర్ నుంచి రథం సెంటర్, బ్రాహ్మణ వీధి మలుపు వరకు శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి చెందిన స్థలాన్ని హాకర్లు, చిరు వ్యాపారులు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. హాకర్లు ఆక్రమించుకున్న స్థలాన్ని రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. కనకదుర్గానగర్‌కు సమీపంలోని సుధాకర్ హోటల్ వద్ద రోడ్డు విస్తరణ అనంతరం దేవస్థానం కొంత స్థలాన్ని కొనుగోలు చేసింది. సుమారు రూ.1.82 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన స్థలాన్ని కొంత మంది చిరు వ్యాపారులు ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆక్రమణలపై ఈవో శీనానాయక్ దృష్టి సారించి స్థల రికార్డులను పరిశీలించారు. ఆలయ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఈవో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులకు రికార్డులను అందజేశారు. దీంతో గురువారం ఏసీ రంగారావు పర్యవేక్షణలో ఆలయ లీజెస్ విభాగం అధికారులు, రెవెన్యూ, మున్సిపల్ శాఖ టౌన్ ప్లానింగ్ సర్వేయర్, వీఆర్వోలు, ఇతర అధికారులు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. దేవస్థానం వద్ద ఉన్న రికార్డుల మేరకు సరిహద్దులను నిర్ణయించారు. అమ్మవారి ఆలయ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఈ ఆక్రమణల తొలగింపు జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

అండర్ పాస్‌లో ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్ నుంచి కేశ ఖండనశాల మధ్య ఉన్న అండర్ పాస్‌లో ఆక్రమణలపై ఆలయ అధికారులు గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అండర్ పాస్, కేశ ఖండనశాల మెట్ల మార్గాన్ని చిరు వ్యాపారులు ఆక్రమించడంతో ఆలయ అధికారులకు ఫిర్యాదులందాయి. పుణ్యస్నానాల అనంతరం భక్తులు అమ్మవారికి ఆలయానికి చేరుకోవాలన్నా, తలనీలాలు సమర్పించే కేశ ఖండనశాలకు వెళ్లాలన్నా జాతీయ రహదారిని దాటాల్సి వచ్చేంది. ఈ క్రమంలో పలువురు భక్తులు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. దీంతో దేవస్థానం నిర్మించిన అండర్ పాస్‌ను కొంత కాలంగా హాకర్లు ఆక్రమించుకుని భక్తుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారారు. దీనిపై పలువురు భక్తులు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలను తొలగించాలని ఈవో ఆదేశాలు జారీ చేయడంతో ఏఈవో తిరుమలేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. ఆధ్యాత్మిక కేంద్రమైన ఇంద్రకీలాద్రి పరిసరాల్లో ఆక్రమణలతో ఆధ్యాత్మికత దెబ్బతింటుందని, ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్‌కు ఆదేశాలు జారీ చేశారని అధికారులు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించే వారిపై దేవస్థానం చర్యలు తీసుకుంటుందని అధికారులు హాకర్లను హెచ్చరించారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

- జిల్లా ఈగల్ టీం సీఐ ధనుంజయ్ నాయుడు
- మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా డ్రగ్స్ శవ యాత్ర



సితార జంక్షన్‌లో విద్యార్థుల మానవ హారం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శేఖర్ బాబు, హఫీజ్ షేక్ అహ్మద్, అధ్యాపకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారంలాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.ధనుంజయ్ నాయుడు హితవు పలికారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో దిష్టి బొమ్మతో 'డ్రగ్స్‌కు శవ యాత్ర' నిర్వహించారు. విద్యాధరపురం కబేళా వద్ద గల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో సితార జంక్షన్ వరకు 'మత్తుతో జీవితం చిత్తు చిత్తు', మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం' వంటి ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధనుంజయ్ నాయుడు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను సేవించి చెడు మార్గంలో పయనించడం వలన ఇటు కుటుంబానికి అటు సభ్య సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. డ్రగ్స్, కొకైన్, గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయించినా, వినియోగిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే పోలీస్ లేదా 1972 నంబర్‌కు సమాచారం అందించాలని, తద్వారా వాటిని అరికడతామని చెప్పారు.

మంచి అలవాట్లతో ఉజ్వల భవిష్యత్..

నవజీవన్ బాల భవన్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ మర్రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు అలవాటుపడి ఆరోగ్యంతో పాటు చదువును పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం నుంచి వారం రోజుల పాటు విజయవాడ పరిసర ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల వినియోగంపై వ్యతిరేక ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌కి శవ యాత్ర పేరుతో దిష్టిబొమ్మతో ర్యాలీ, మానవ హారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. మాదక ద్రవ్యాలకు బానిసలై ఉత్సాహంతో ఉరకలెత్తాల్సిన యువత జవసత్వాలు సన్నగిల్లి యవ్వనంలోనే శారీరకంగా, మానసికంగా నిర్వీర్యమైపోతుందని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం సితార జంక్షన్‌లో మానవ హారంగా ఏర్పడి మత్తు పదార్థాల నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈగల్ టీం ఎస్ఐ ఎం.వీరాంజనేయులు, భవానీపురం ఎస్ఐ అనూష, కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్, అధ్యాపకులు బి.వెంకన్న, ఎస్.కృష్ణకిశోర్, నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్స్ కె.ప్రియాంక, బి.రమేష్, ఎస్.జాకబ్ రాజు, ఎస్‌కే నజ్మా, ఎన్.దేవమణి, డి.వెంకటేశ్వరరావు, ఎ. లీలావతి తదితరులు పాల్గొన్నారు.

వార్డు స్థాయి సిబ్బందికి డిజాస్టర్ రిస్క్ రెడక్షన్ శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వరదలు, ఇతర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండేందుకు వార్డు స్థాయి సిబ్బందికి డిజాస్టర్ రిస్క్ రెడక్షన్ శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమైందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఫస్ట్ ఎయిడ్, సెర్చ్ అండ్ రెస్క్యూ, ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్, ఎమర్జెన్సీ ఫీడింగ్, వెల్ఫేర్, కమ్యూనికేషన్, డ్యామేజ్ అసిస్టెంట్ తదితర అంశాలతో కూడిన ట్రైనింగ్ ప్రతి వార్డ్ అధికారికి ఇవ్వాలని కిందిస్థాయి అధికారులకు సూచించామన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు

విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో 23 లోతట్టు ప్రాంతాలు, కృష్ణా, బుడమేరు పరివాహక వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. జోనల్ కమిషనర్లు తమ తమ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా విభాగాల అధికారులు వారి సిబ్బందితో మాక్ డ్రిల్ కార్యక్రమాలు, వరదలు, భారీ వర్షాలు కురిసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు ముందుగానే నిర్ధారించుకోవాలన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని ఊర్మిళా నగర్, పాత రాజరాజేశ్వరిపేట, మిల్క్ ఫ్యాక్టరీ ఏరియా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ గాంధీ బొమ్మ రోడ్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడటౌన్) పి.రవీంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మానవ మందిరం రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, కొల్లాపూరం రోడ్, డాల్ఫిన్ బార్ రోడ్, ఐఓసీ పెట్రోల్ బంక్ రోడ్, చర్చి రోడ్, గాంధీ బొమ్మ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

27 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 27 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 27 మందిపై 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. 27 మందిని కోర్టులో హాజరుపరచగా ఆరవ అదనపు జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 21మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చేరే విద్యార్థులకు రెండో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 20 నుంచి జులై 17వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా ఐటిఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు కూడా ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు ఫోన్: 0866-2475575, 94906 39639 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇద్దరు ఫార్మసీ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్



గొల్ల ఇందుశ్రీ



ఎ.నాగలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 25న జరగనున్న కృష్ణా విశ్వ విద్యాలయం స్నాతకోత్సవంలో విజయవాడలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఎం ఫార్మసీ విద్యార్థినులు ఎ.నాగలక్ష్మి, గొల్ల ఇందుశ్రీలు గోల్డ్ మెడల్స్ అందుకోనున్నారు. చదువులో రాణించడంతో పాటు పరిశోధనా పత్రాల్లో ప్రతిభ చూపడంలో వారిద్దరూ గోల్డ్ మెడల్స్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సునీత అభినందించారు.